ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024

I

అల్లూరి సీతారామరాజు



ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్సై రవీంద్ర ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో వివిధ ప్రాంతాలలో స్పెషల్ పార్టీ బలగాలు, సిఆర్‌పిఎఫ్‌తో వాహనాలు, కలవర్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం కావడంతో నగదు, మద్యం రవాణాకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఉంటుందని, ఓటర్లు , వివిధ రాజకీయ నేతలు సహకరించి పోలింగ్ సజావుగా జరిగేలా సహకరించాలని ఆయన తెలిపారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నేడే పోలింగ్

▸▸ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహణ

▸▸ పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది



అరుకు నుంచి వెళుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- పాడేరు: ఈనెల 13న సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధం అయ్యింది. అల్లూరి జిల్లాలో పోలింగ్ నిర్వహణకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సిద్ధం చేసి ఉంచిన ఎన్నికల సామాగ్రిని ఈవీఎంలను ఆదివారం ఉదయం సిబ్బందికి పంపిణీ చేశారు. బస్సులు, జీపులు ఇతర వాహనాల్లో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు సామగ్రితో తరలి వెళ్లారు.

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 318, అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో 304, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 39 చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు ముందు రోజే సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

జిల్లాలో 610 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 5400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాలో 28 అరకు, 29 పాడేరు, 53 రంపచోడవరం నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామాగ్రి ఆయా రిటర్నింగ్ అధికారుల ద్వారా పంపిణీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 4 గంటలకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూముకు చేరుకున్న జిల్లా ఎన్నికల అధికారి కలక్టర్, సాధారణ పరిశీలకులు వివేకానందన్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమును తెరచి ఇవిఎంలను, ఇతర సామాగ్రిని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసి భావన విశిష్ట్ ద్వారా పంపిణీకి ఏర్పాటు చేశారు. అదేవిధంగా అరకు చేరుకున్న జిల్లా ఎన్నికల అధికారి, సాధారణ పరిశీలకులు స్ట్రాంగ్ రూములో ఎన్నికల సామాగ్రిని అరకు రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు, కలక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. సోమవారం ఉదయం సంబంధిత పోలింగ్ కేంద్రాలలో తప్పనిసరిగా మాక్ పోలింగ్ నిర్వహించాలని ఓటింగ్ సమయంలో ఒత్తిడికి గురి కాకుండా, నిర్లక్ష్యం ప్రదర్శించకుండా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో 7,71,193 మంది ఓటర్లు ఉన్నారని, అందుకు 1021 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 16 మంది, అరకు నియోజకవర్గంలో 17 మంది, రంపచోడవరం నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు.

రంపచోడవరం నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య, ఎఎస్పి జగదీష్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంల గోడౌన్ తెరచి ఎన్నికల సామగ్రి పంపిణీ నిర్వహించారు.



పాడేరు నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

-రిటర్నింగ్ అధికారి, జెసి భావన వశిష్ట్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహణకు ఎన్నికల అధికార్లు, సిబ్బంది సహకరించాలని ఆ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జేసి భావన వశిష్ట్ కోరారు. ఆదివారం పాడేరు నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బందికి పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలో 2,48,387 మంది ఓటర్లకు 304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, సుమారు 2300 మంది సిబ్బందిని ఎన్నికల విధులు నిర్వహణకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సామాగ్రిని సకాలంలో సంబందిత పోలింగ్ కేంద్రాలకు తరలించే విధంగా అవసరమైన వాహనాలను సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలక్టర్ ధాత్రిరెడ్డి, తహసిల్దార్ కళ్యాన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 48 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో 37981మంది ఓటు హక్కును వినియోగించను న్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు చేరుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో ప్రత్యేక బలగాలు చేరుకుని జల్లేడ పడుతున్నారు. పోలింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



సీలేరులో కురుస్తున్న భారీ వర్షం

ఈదురుగాలులు, ఉరుములతో
కుండపోత వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం
వారపు సంతలకు అంతరాయం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరు ప్రాంతంలో ఆదివారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12.42 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనంతరం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకున్నాయి. క్షణాల్లోనే ఈదురుగాలులు, పెద్దపెద్ద ఉరుములతో కుండపోత వర్షం గంటన్నర పాటు కురిసింది. దీంతో రోడ్లు, డ్రైనేజీలు జలమయమయ్యాయి. ఏపీజెన్కో కాలనీ వర్షపు నీరుతో డ్రైనేజీ నుండి చెత్తాచెదారాలు కొట్టుకొచ్చి నివాసప్రాంతాల్లో నిల్వ ఉండిపోయాయి. 8వ క్రాస్ రోడ్డు మదుము కింద భాగంలో చెత్త ఇరుక్కుపోయింది. వరద నీరు మసీదు వీధిలో ఏరులై పారింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గృహిణులు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి భానుడు ప్రతాపంగా, మధ్యాహ్నం కుండపోత వర్షం కురవడంతో చల్లటి వాతావరణం నెలకొంది.

వారపుసంతకు ఆటంకం

కుండ పోత వర్షం కారణంగా సీలేరులో ఆదివారం వారపు సంతకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షం కారణంగా వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. గాలి, వర్షం దాటికి రోడ్లపై దుకాణాలు వేసుకున్న చిరు వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురైయ్యారు. దుప్పిలివాడ పంచాయతీకి చెందిన గిరిజనులు వారపు సంతకు తెచ్చిన కూరగాయలు అమ్ముకోలేకపోయారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వారపు సంతకు వచ్చిన గిరిజనులు తమకు కావలసిన నిత్యావసరుకులు కొనుగోలు చేయడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. జికె.వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురవడంతో దారకొండ వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నం నుంచి వచ్చిన బట్టలు, ఫ్యాన్సీ, తదితర వ్యాపారులు వ్యాపారాలు నిలిచిపోవడంతో డీలాపడ్డారు.



సీలేరులో వర్షపు నీటితో కలిసి ప్రవహిస్తున్న డ్రైనేజీల్లోని చెత్తా చెదారం

ఓటు కోసం వలస కూలీల రాక

ప్రజాశక్తి- అనంతగిరి: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మండలంలోని వలస కూలీలు తిరుగు గ్రామానికి తరలి వచ్చారు. మండలంలోని ఎన్ఆర్ పురం, భీంపోలు, గంమ్మట తదితర పంచాయతీ పరిధి గ్రామాల నుండి గిరినులు పొట్ట కుటి కోసం వలస వెళ్లారు. ఎన్నికలతరుణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు తిరిగి గ్రామాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని ఆదివారం తిరిగి వచ్చారు.

ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు విజయవాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కర్నూలు తదితర ప్రాంతాలకు వివిధ రకాల పనుల కోసం తరలి వెళ్లారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో చేపల చెరువులు, ఇటుకల బట్టీల్లో పనులు చేస్తుంటారు. అక్కడి ప్రాంతాల్లో ఎంతో కాయ కష్టపడి పని చేస్తుంటారు. సంవత్సరంలో సంక్రాంతి, దసరా పండగలకు సాధారణంగా మండలంలోని స్వంత ఊర్లకు వస్తుంటారు. అయితే ఈ ఏడాది ఐదేళ్ల తర్వాత ఎన్నికలు రావడంతో ఓటు వేసేందుకు తరలి వచ్చారు.



ఆటోలో తరలివచ్చిన గిరిజనులు



తాగునీటి కోసం వేచివున్న మహిళ

పెదలబుడులో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయితీ పెదలబుడు గ్రామంలో తాగునీరు అందక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 350 కుటుంబాలు 1200 పైగా జనాభా నివసిస్తున్నారు. రెండేళ్ల నుండి నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత సేపు మోటార్ వేసినా నీరు ట్యాంక్‌కు పూర్తి స్థాయిలో ఎక్కక పోవడంతో నీరు సరఫరా కాలేదని గ్రామస్తులు తెలిపారు. వీధిలకు కుళాయి కనెక్షన్లు ఉన్నపటికీ చుక్క నీరు రాలేదని దీంతో వేరే ప్రాంతాలకు వెళ్లి కుళాయిల వద్ద పడిగాపులు కాసి నీరు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.దీంతో దిష్టిబొమ్మల్లా కుళాయిలు దర్శనమిస్తున్నాయి. ట్యాంక్ కుళాయి కనెక్షన్లు ఉన్నపటికీ పట్టించుకునే నాయకుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ట్యాంకు నుంచి గ్రామానికి నీరు సరఫరా చేయాలని లేకపోతే ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి నీరు సరఫరా చేయాలని మహిళలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నీరు ఎక్కని ట్యాంకు ఇదే..

యధావిధిగా విద్యుత్ స్తంభం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీడికాడ: ఇటీవల కురిసిన వర్షాలకు కరెంటు స్తంభం నేల కొరగడంతో పొంచివున్న ప్రమాదం పేరుతో ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.చీడికాడ మండల ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రావు వెంటనే స్పందించి హుటాహుటిన వాలిపోయిన స్తంభాన్ని సిబ్బందితో సరి చేశారు. ఈ మేరకు ప్రజాశక్తిని ఆయన అభినందించారు.



స్తంభాన్ని నిలబెట్టిన సిబ్బంది

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి

ఇంటలిజెన్స్ హెచ్చరికతో పోలీసుల అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు విద్రోహక చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని ఇంటలిజెన్స్ వర్గాలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టుల కదిలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సురక్షితంగా ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు చేరే విధంగా పగడ్బందీ చర్యలు చేపట్టారు. మావోయిస్టులు ఎటువంటి చర్యలకు ఉపక్రమించిన దీటుగా ప్రతిఘటించడానికి కేంద్ర పోలీస్ బలగాలను రంగంలో దింపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు ముందస్తుగానే పోలీసులు చేరుకొని అణువణువునా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మావోయిస్టుల కదలికలు, వారికి సహకరించే సానుభూతిపరులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మూలమూరు గిరిజన గ్రామాల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, ఆక్టోపాస్ తదితర బలగాలను వందల సంఖ్యల్లో దింది జల్లెడ పడుతున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణ, చతీష్‌ఘడ్ రాష్ట్రాల్లో 50 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మావోయిస్టులు పోలీసు బలగాలను తరలిస్తున్న వాహనాలు లక్ష్యంగా చేసుకొని గ్రానైట్స్, ల్యాండ్ మైన్స్‌తో ప్రతీకార దాడులకు పాల్పడవచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బాంబు స్క్వాడ్ బృందాలతో ముందస్తుగా క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ బలగాలను జీకే వీధి మండలం సీలేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా, కల్వర్టులు, ముఖ్య కూడళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆదివారం వారపు సంతలో మావోయిస్టు సానుభూతిపరులు యాక్షన్ టీం సభ్యులు సంచారంపై దృష్టి సారించి ఆ దిశగా గోప్యంగా తనిఖీలు చేపట్టారు. పోలింగ్ బూతులు ఏర్పాటు చేసిన సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. జికె.వీధి సిఐ, ఎస్ఐల ఆధ్వర్యాన మండలంలోని ఆదివారం రహదారులు, కల్వర్టులు మెటల్ డిటెక్టర్లతో, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు.



ఎఓబి సరిహద్దులోని ప్రధాన రహదారిపై పహారా కాస్తున్న పోలీసులు

ఆధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా

మావోయిస్టుల కదిలికులపై అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా పెట్టినట్లు సిఐలు అశోక్ కుమార్, అప్పలనాయుడు, జికె.వీధి ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఉపయోగిస్తున్నామన్నారు. మావోయిస్టు ఎటువంటి చర్యలకు ప్రయత్నించినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో భాగంగానే అనుమానిత ప్రదేశాలను డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తాము వినియోగిస్తున్న డ్రోన్ కెమెరాలతో ఎన్నికలు ఓటింగ్ జరిగే ప్రదేశం నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో మావోయిస్టులు కదిలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు సృష్టించకుండా ప్రతి ఒక్కరూ పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



మెటల్ డిటెక్టర్లతో కల్వర్టు వద్ద పరిశీలిస్తున్న పోలీసులు



జికె.వీధి పోలీస్ గ్రౌండ్‌లో అత్యాధునిక డ్రోన్ కెమెరాలను సిద్ధం చేస్తున్న పోలీసులు



గోరు కృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కృష్ణ మరణం సిపిఎంకు తీరని లోటు

ప్రజాశక్తి- కూనవరం

సిపిఎం కూనవరం సీనియర్ సభ్యులు గోరు కృష్ణ అకాల మరణం పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన గోరు కృష్ణ సంతాప సభ ఆదివారం జరిగింది. కృష్ణ చిత్ర పటానికి సిపిఎం నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేసిన కృష్ణ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, తలగాని నాగరాజు, ఇల్లందు మండల కార్యదర్శి కృష్ణ, ములకలపల్లి మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి మధు, పిఎన్ఎం కళాకారులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలతో ఉపాధి హామీ కూలీల విలవిల

ప్రజాశక్తి-విఆర్.పురం

భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతుండడంతో ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసే కూలీలు విలవిలలాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు నుండే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో మండలంలోని ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు నానా అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాలలో నీడ, మంచినీరు ఏర్పాట్లు చేయకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండే వేసవి దృష్ట్యా పని వేళలు కుదించాలని ఆయా గ్రామాల ఉపాధి కూలీలు కోరుతున్నారు. అధిక ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో రోజువారీ వేతనంతో పాటు అదనపు వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. పార, తట్ట ఇతర పనిముట్లకు కూడా అదనపు ఇవ్వాలని, పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు.



పని ప్రదేశంలో మండు టెండలో గుడ్డలు కప్పుకొని ఉన్న కూలీలు

పోలింగ్‌కు సర్వం సిద్ధం



రంపచోడవరంలో ఎన్నికల సామగ్రిని పంపిణీచేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రంపచోడవరం : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇవిఎంలు, వివి.ప్యాడ్లు, ఇతర సామగ్రి విజయవంతంగా తరలించినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, వివి ప్యాడ్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని పోలింగ్ అధికారులకు పంపిణీ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్, అడిషనల్ ఎస్పీ జగదీష్ హెచ్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కావూరి చైతన్య ఎన్నికల సామాగ్రి అందజేసే కౌంటర్లను పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి 73 రూట్లుగా విభజించి 59 సెక్టార్ అధికారాల ద్వారా తరలించడానికి 86 బస్సులను, 79 జీపులను వినియోగించడం జరిగిందని తెలిపారు. సుమారు మూడు వేల మంది పిఒ, ఎపిఒ, ఒపిఒలను ఎన్నికల విధులకు నియమించడం జరిగిందని తెలిపారు.

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,77,317 మంది ఓటర్లకు గాను 11 మండలాలలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో 500 మంది రెవిన్యూ వివిధ శాఖలకు చెందిన అధికారులను ఎన్నికల విధులకు కేటాయించడం జరిగిందని తెలిపారు. అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా వివి ప్యాడ్లు, ఈవీఎంలు ఎన్నికల సిబ్బందికి అందజేయడం జరిగిందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతం పాతకోట, బొడ్డగండి, గుర్తేడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వివి పాడ్లు గుర్తేడు నుండి హెలీకాప్టర్‌లో రంపచోడవరం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 399 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్ట్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత సెక్టర్ అధికారులకు తెలియజేయాలన్నారు. 399 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల రోజున ఉదయాన్నే మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించి ప్రశాంతంగా తిరిగి ఎన్నికల సామాగ్రి స్ట్రాంగ్ రూముకు చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, చలపతిరావు, నజీముల్లా, నాగమణి, నాగరాజు, డివి సత్యనారాయణ, డిఎల్‌పిఒ రఘునందన్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, డిప్యూటీ తహశీల్దార్లు శివ, స్వామి, బి రాజు, బాలాజీ, చైతన్య, ఎ.సత్యనారాయణ, శ్రీధర్, రవీంద్రబాబు, సరిత, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగుకు పూర్తి ఏర్పాట్లు

విఆర్.పురం : మండలంలో ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏజెన్సీలో పోలింగ్ ఒక గంట ముందే అంటే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల అధికారులు

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పోలింగ్ బూతులకు ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం రాత్రి 7.45 గంటలకు సురక్షితంగా చేరుకున్నారు. సోమవారం జరిగే ఎన్నికలకు రూట్ ఆఫీసర్ శ్రీనివాస్ బిఎల్వోలు కుసుమ రేవతి అనుష్క పోలింగ్ బూతులలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ సౌకర్యం మంచినీరు బెంచీలు, సామగ్రి కొరత లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. వచ్చిన ఎన్నికల సిబ్బందికి భోజన వసతి సౌకర్యాలు సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. పోలింగ్ బూతులు చుట్టుపక్కల పోలీసు బలగాలతో భద్రతను స్థానిక ఎస్ ఐ రామకృష్ణ కట్టు దిట్టం చేశారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత, పిఒ అభిషేక్ తదితరులు

పోలింగ్ కేంద్రాలకు ఇవిఎంలు, ఇతర సామాగ్రి తరలింపు



సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఎన్నికల భూతులకు పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎంలు సిబ్బందిని చేర్చారు.

పటిష్టంగా ఎన్నికల సామగ్రి తరలింపు

అరకులోయ:ఎన్నికల సామగ్రి తరలింపు పటిష్టంగా చేపట్టామని అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు..జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, సాధారణ పరిశీలకులు కె. వివేకానందన్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి బి .అభిషేక్ స్ట్రాంగ్ రూములను తెరిచి ఈవీఎంల పంపిణీ ప్రారంభించారు.మధ్యలో ఒక గంట వర్షం అంతరాయం కలిగించినా మధ్యాహ్నం ఒంటిగంటకు ఈవిఎం పంపిణీ ప్రక్రియను నిర్విఘ్నంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందిని తరలించడానికి 48 బస్సులు, 88 జీపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1786 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. 98 శాతం సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. నియోజకవర్గంలో 2.47 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వీరందరూ ఓటు హక్కును వినియోగించు కోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఏజెన్సీలోని విభిన్న పరిస్థితుల కారణంగా ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటలకు ముగించాలన్నారు. సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, తహసిల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు :మండలంలో ఎన్నికల్లో భాగంగా 23 పంచాయతీలకు గాను 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ రంగారావు ఆదివారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమస్యాత్మక మారుమూల ప్రాంతమైన ఇంజరి, చీకుపనస, గిన్నెలకోట పంచాయతీ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ఆక్రమించి చదును చేసిన కాలువ స్థలం

కాలువ స్థలం ఆక్రమణ

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -**కోటవురట్ల:**మండలంలో రెవెన్యూ గ్రామమైన కె.వి అగ్రహారం సర్వే నంబర్ 5-8 సమీపంలో గల భూములను ఆనుకొని ఉన్న చెరువుకు నీరు వచ్చే కాలువ ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇదే రెవెన్యూ గ్రామంలో రెవిన్యూ కొండను ఓ భూ బకాసురుడు సుమారు 70 ఎకరాలు ఆక్రమించుకొన్న అంశంపై పలుమార్లు ప్రజాశక్తి పత్రికల్లో ప్రచురించినా నామమాత్రంగానే, తూతూ మంత్రంగానే రెవెన్యూ అధికారులు దాడులు, కొలతలు అంటూ ఆర్భాటం చేశారు కానీ దానిపై సమగ్ర విచారణ చేపట్ట లేదు. ప్రస్తుతం సమీపంలోనే సర్వే నెంబరు 5-8లో చెరువు కాలువను పలువురు ఆక్రమించుకుంటున్నారు. చెరువుకు వెళ్లే కాలువను అదే చెరువు మట్టితోనే పూడ్చి వేయడం విశేషం. ఇంత జరుగుతున్నా ప్రధాన రహదారికి అనుకొని ఉన్న కాలువ ఆక్రమణపై అధికారులు పట్టించు కోకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కాలువ ఆక్రమణకు గురైతే వర్షపు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలు అరికట్టాలని కోరుతున్నారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి -**గాజువాక** : అండిబోయిన అప్పారావు యాత కార్పొరేషన్ డైరెక్టర్, హైకోర్టు న్యాయవాది అండి బోయిన లక్ష్మి వివాహ దినోత్సవం సందర్భంగా ఆదివారం సమతానగర్‌లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై మాట్లాడుతూ, అండిబోయిన అప్పారావు, లక్ష్మి దంపతులు పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. వీరిద్దరూ మంచి క్రీడాకారులన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు మస్తానప్ప, స్థానిక నాయకులు వేంపాడు అప్పారావు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -**తగరపువలస** : జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణా శిబిరాన్ని పిఎన్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు నరసింహారావు ఆదివారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న బాల బాలికలకు పాలు, కోడి గుడ్లు, బిస్కెట్లు అందజేశారు. శిక్షణా శిబిరం నిర్వాహకులు బి.పరదేశి, గౌతమ్, వైసిపి నాయకులు తమ్మిన అశోక్ పాల్గొన్నారు.

ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం

ప్రజాశక్తి -**గాజువాక** : గాజువాక నియోజవర్గంలో ఉన్న క్రీడాకారులకు ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభమవుతోంది. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టాలని ఏడెకరాలు విస్తీర్ణంలో 1999వ సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు నలుగురు ఎమ్మెల్యేలు మారారు తప్ప పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం, తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. నాలుగు సార్లు శంకుస్థాపన చేయడమే జరిగింది తప్ప, ఒక పైసా పని కూడా జరగలేదు. ఈ ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డి రూ.ఐదు కోట్లు వ్యయంతో దీనికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన తర్వాత స్థానిక ఇంజినీరింగ్ అధికారులు గత నెల రోజులుగా పనులు కూడా మొదలుపెట్టారు. మొదట్లో యువకులు దీనికి సంబంధించిన డిజైన్ సరిలేదని గొడవ చేశారు. ఇంజినీరింగ్ అధికారులు దానికి వివరణ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం గోతులు పూడ్చే కార్యక్రమం పూర్తయింది. సిమెంట్ పనులు కూడా మరో రెండు రోజుల్లో చేపట్టనున్నారు. ఏడాదిలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు పట్టుదలతో ఉన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే గాజువాక నియోజకవర్గ క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుందని యువకులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఊపందుకున్న ప్రలోభాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం

పోలింగ్ వేళ ప్రలోభాలు ఊపందుకున్నాయి. ప్రధాన పార్టీలు ఓట్లకు డబ్బులు ఎరవేస్తున్నాయి. డబ్బులు అందని వారు పలుచోట్ల గలాటా సృష్టిస్తున్నారు.

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్లకు రూ.1500 చొప్పున ఇంటింటికి ఆయా పార్టీల చెందిన కార్యకర్తలు అందజేశారు. ఏ వీధిలో చూసినా ఈ పంపకాలు బహిరంగంగానే సాగాయి. వైసిపి నేతలు ఓటుకు రూ.1500 పంపిణీ చేయగా, తెలుగుదేశం నాయకులు ఒక చీర, రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్పులు లేని వారు, వలస వెళ్లిన వారికి పార్టీలు అందించిన తాయిళాలు అందలేదు.

తెలుగుదేశం పార్టీ వారుగా గుర్తింపు పొందిన వారికి వైసిపి నేతలు డబ్బులు ఇవ్వడంలేదు. అయితే తెలుగుదేశం పార్టీ నేతలు మాత్రం కాలనీలో పార్టీతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ డబ్బులు అందజేశారు.

బహిరంగంగా అందరికీ పంపిణీ చేసేటప్పుడు తమకు వైసిపి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. ఓట్లకు నోట్లు ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి మా తరంలో ఎన్నడూ లేదని సీనియర్ సిటిజన్స్ వ్యాఖ్యానిస్తున్నారు.

పంపిణీకి దూరంగా సిపిఐ

సిపిఐ పార్టీ తరపన పోటీ చేస్తున్న అత్తిలి విమల మాత్రం ఎక్కడా ఇటువంటి ప్రలోభాలు చేపట్టలేదు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఓటును అభ్యర్థించారే తప్ప తాయిలాల జోలికి పోలేదు. ప్రజాస్వామ్యు విలువలను కాపాడాలంటే వామపక్ష పార్టీలు చట్టసభల్లో అడుగు పెట్టాలని నిజాయతీపరులు చర్చించుకుంటున్నారు.

ఎన్నికలకు అన్ని విధాలుగా సన్నద్ధం

- విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి-అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో పోలీస్ శాఖ అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నదని, ఈవీఎం రవాణా కొరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనకాపల్లిలోని జీవీఎంసీ మెయిన్ స్కూల్ ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, అనకాపల్లి మండలం రేబాక పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ తీసుకున్న భద్రత ఏర్పాట్లు, పోలింగ్ బూత్‌లో వెబ్ కాస్టింగ్, లైటింగ్, క్యూ లైన్‌ల ఏర్పాటు తదితర విషయాలను పరిశీలించి స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈవీఎంలు రవాణా చేసే సమయంలో పోలింగ్ సిబ్బంది మీద, పోలింగ్ సమయంలోనూ ఎవరైనా గొడవలు చేస్తే వారి మీద తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ హెచ్చరించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండటం వలన ఐదుగురుకు మించి ఎవరు గుంపులుగా తిరగరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవరూ ఉండకుండా చూడాలన్నారు. 200 మీటర్ల దూరంలోనే ఓటర్ల వాహనాలు నిలిపివేయాలని, ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థి వాహనాలను మాత్రమే అనుమతించబడతాయని, అవి కూడా ఆర్వో అనుమతి పొందిన మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారని చెప్పారు. వాహనాలలో ఐదుగురకు మించి ఉండరాదన్నారు. ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పటికే రూట్ మొబైల్, క్యూ ఆర్ టి టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామని వీరి సమన్వయంతో పనిచేస్తూ అన్ని ప్రాంతాలను కవర్ చేసేలాగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షకాలను పంపిణీ చేస్తుంటే సి విజిల్ యాప్ ద్వారా గాని లేదా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని తెలియాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ అప్పలరాజు, అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా ఆరోగ్య వేదిక నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వైద్యులు సాంబ మూర్తి, మీనేంద్ర కుమార్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వారు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 సంవత్సరం నుండి ప్రతి రెండు నెలలకు ఒకసారి, రెండవ ఆదివారం క్రమం తప్పకుండా కరోనా సమయంలో సైతం వైద్య శిబిరాలు నిర్వహించి, నేటికీ 45వ రెగ్యులర్ మెడికల్ క్యాంప్ జరుగుతుందని చెప్పారు. ఈ మెడికల్ క్యాంప్‌లో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధులకు మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రెగ్యులర్ మెడికల్ క్యాంపు కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక సభ్యులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

18న కన్యకాపరమేశ్వరి ఉత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్‌టౌన్ ప్రాంతంలో 147 సంవత్సరాల చరిత్రగల శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 18న వైశాఖ శుద్ధ దశమి నాడు కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘ అధ్యక్షులు అరిశెట్టి దినకర్ ఆదివారం తెలిపారు. 18న తెల్లవారుజాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, రజిత వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పములతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవి మూల మంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పేదలకు అన్నదానం నిర్వహించుచున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని దేవాలయ కార్యకర్తల సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ ఉప్పల భాస్కరరావు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్, కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్లు బాదం దినేష్, డాక్టర్ గోగుల సువర్ణ కుమార్, కడిమిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

కిరాయి డబ్బులు ఎగ్గొట్టారు..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అద్దె వాహనాలకు ఐదేళ్లయినా నేటికీ చెల్లించని వైనం

ప్రజాశక్తి-చింతూరు : 2019 సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ఎన్నికల విధులకు ఉపయోగించుకున్న ప్రైవేటు వాహనాలకు సంబంధిత అధికారులు నేటికీ కిరాయి డబ్బులు చెల్లించలేదు. ఐదేళ్ల గడిచినా నేటికీ చెల్లించకపోవడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారులు బూత్‌ల వారీగా తిరగడానికి కిరాయి ఇస్తామని చెప్పి ఆరు ప్రైవేటు వాహనాల (కార్లు)ను ఆర్‌టిఒ స్థాయి అధికారులు నమ్మబలికి తీసుకున్నారు. ఈ వాహనాలను వారం రోజుల పాటు వాడుకున్నారు. ఎన్నికలు ముగిసినా ఆ వాహనాలకు కిరాయి డబ్బులు ఇవ్వలేదు. బాధిత వాహనదారులు అడిగితే రేపిస్తాం.. మాపిస్తామంటూ నెలలు, ఆపై సంవత్సరాలు గడిపేశారు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఐదేళ్లయినా నేటికీ కిరాయికి పెట్టిన వాహనదారులకు డబ్బులు ఇవ్వకుండా ఎగవేశారు. నిద్రాహారాలు లేకుండా కిరాయికి తిరిగిన కారులకు డబ్బులు ఇవ్వకపోవడంపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. చింతూరు కార్యాలయం, రంపచోడవరం ఆర్డీవో కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేదని బాధితులు చెబుతున్నారు. భార్య బిడ్డలను వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లి కారు కిరాయికి తిప్పితే ఒట్టి చేతులతో ఇంటికి పంపివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఐటీడీఏ పూర్వ పీవో ఆకుల వెంకటరమణకు కూడా మొరపెట్టుకున్నామని, అధికారులతో మాట్లాడి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు కానీ ఐదేళ్లయినా నేటికీ అందలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమ వాహనాల కిరాయి డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని బాధితులు హెచ్చరిస్తున్నారు.

ఐదేళ్లయినా కిరాయి చెల్లించలేదు



2019 సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా నాటి ఆర్డీవో కార్యాలయ అధికారి రాంబాబు కిరాయి డబ్బులు చెల్లిస్తామని చెప్పి నా కారును ఎన్నికల విధులకు రంపచోడవరం పంపించారు. తొలుత నేను చింతూరు, కూనవరం, విఆర్.పురం, ఎటపాక నాలుగు మండలాల్లో మాత్రమే తిప్పగలనని చెప్పాను. దానికి విరుద్ధంగా రంపచోడవరం పంపించి అక్కడ అడవుల్లో తిప్పారు. కాని కిరాయి డబ్బులు ఇవ్వలేదు. ఎప్పుడు అడిగినా బిల్లు రావాలంటూ సమాధానం చెప్పేవారు. పూర్వ ఐటిడిఎ పిఒ ఆకుల వెంకటరమణకు కూడా ఈ విషయంపై దరఖాస్తు చేశాం. నాతోపాటు మరో నలుగురు వారి వాహనాలు కూడా ఎన్నికలకు విధులకు ఉపయోగించారు. ఐదు సంవత్సరాలు కావస్తున్నా మాకు కిరాయి డబ్బులు చెల్లించలేదు. వెంటనే మా కిరాయి డబ్బులు ఇప్పించాలి. లేకుంటే ఆందోళన చేస్తాం.

- త్రినాధ్, కారు యజమాని, కూనవరం.

కిరాయి డబ్బులు చెల్లించాలి

ఎన్నికల్లో తిప్పడానికి కిరాయి డబ్బులు చెల్లిస్తామని చెప్పి ఆనాడు అధికారులు నా వాహనాన్ని ఉపయోగించారు. వారం రోజులు వాహనాన్ని ఉపయోగించుకున్నారు. కనీసం డ్రైవర్‌కు బేటా ఇవ్వలేదు. నాకు వాహనం కిరాయి సుమారు రూ.25వేలు ఇవ్వవలసి ఉంది. ఎన్నిసార్లు అడిగినా వస్తాయంటూ ఐదు సంవత్సరాలుగా దాటవేస్తూ వస్తున్నారు.. మా కిరాయి డబ్బులు మాకు తక్షణమే చెల్లించాలి.

- ఇబ్రహీం, కుంట గ్రామం



గత ఎన్నికల సమయంలో అద్దెకు ఇచ్చిన కారు

ఓటును సద్వినియోగం చేసుకోండి

తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగపరుచుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన తిరుగులేని ఆయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయడాన్ని గర్వకారణంగా భావించాలన్నారు. రాష్ట్ర ప్రగతిలోనూ, దేశ ప్రగతిలోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగు తుందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంతో వీలైనంతవరకు పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేసేందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని పనులున్నప్పటికీ మొదటి ప్రాధాన్యత ఓటు హక్కును వినియోగించుకోవడానికే ఇవ్వాలన్నారు. ఓటు ప్రాధాన్యతను గుర్తించి సుదూర ప్రాంతాల నుంచి కూడా తరలి వచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. పోలింగ్ అధిక శాతం జరిగితే ప్రజల మెజారిటీ అభిప్రాయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. కనీసం 90 శాతం వరకు పోలింగ్ జరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థ ఘనవిజయం సాధించినట్టేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించుకోవాలని, అందుబాటులో ఉన్న అభ్యర్థులలో మంచి గుణ గుణాలు కలిగినవారికి, ప్రజలకు అందుబాటులో ఉండే వారికి ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను రక్షించలేని అభ్యర్థికి, ప్రజలకు అందుబాటులో ఉండని అభ్యర్థికి ఓటు వేస్తే మరో ఐదేళ్లపాటు మంచి పరిపాలన కోసం ఎదురుచూడాల్సి వస్తుందన్నారు. మనలో చాలామందికి అవినీతి, అక్రమార్కులను ప్రశ్నించాలని ఉంటుందన్నారు. అయితే వివిధ కారణాలవల్ల ప్రశ్నించలేని వారు తమ ఓటునే ఆయుధంగా ఉపయోగించు కోవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఆలూరి విష్ణువర్ధన్, జి.జగదీష్ పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డబ్బుకు, ప్రలోభాలకు లొంగకుండా నాగవంశం సామాజిక తరగతి వారంతా సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాగవంశం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ గెలుపు కోసం డబ్బును ఖర్చు చేసి, విజయం పొందిన తర్వాత పెద్ద ఎత్తున ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని, ఇటువంటి నాయకుల వల్ల మేలు జరగదని అన్నారు. రాష్ట్రంలో ఏటా మూడు లక్షల మంది ఇంజినీరింగ్ చదువుకున్న వారు పట్టాలు తీసుకుంటున్నారని, అయితే వీరిలో లక్ష మందికి మాత్రమే ఉపాధి లభిస్తోందని తెలిపారు. మిగిలిన రెండు లక్షల మంది ఎటువంటి ఉపాధీ లేక విద్యతో సంబంధంలేని పనులు చేసుకుని జీవనం చేయడం, లేదా ఇతర ప్రాంతాలకు వలసలు పోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల పాలనపై నమ్మకాలు పోయాయన్నారు. రాష్ట్రానికి రాజధాని లేదన్నారు. పోలవరం పూర్తి కాలేదన్నారు. నాగవంశీయులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటయినప్పటికీ, దానికి నిధులు కేటాయించలేదన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీర్రాజు పాల్గొన్నారు.

ఓటర్లకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : సోమవారం జరుగు సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఇటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఓటు హక్కు ప్రజలు వినియోగించుకొనే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు నడవలేని వృద్ధులకు ప్రత్యేక సదుపాయము కల్పించాలని కోరారు. అధిక శాతం ఓటింగ్‌కు రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.